

జిల్లాలో 381. 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో మోస్తారు వర్షం కురిసింది. 32 మండలాల్లో కురిసిన వర్షానికి జిల్లాలో 381.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు రెవిన్యూ అధికారులు ఆదివారం తెలిపారు. జిల్లాలో సగటున 11.9 మిల్లీమీటర్ల వర్షం పడింది. అత్యధికంగా తాడిమర్రి మండలంలో 74.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. అతి స్వల్పంగా తలుపుల మండలంలో 1.4 మిల్లీమీటర్లు నమోదు అయింది. జిల్లాలో 32 మండలాలు ఉండగా ఒక్క తనకల్లు మండలంలో మాత్రం వర్షపాతం నమోదు కాలేదు. తుఫాను కారణంగా అకాల వర్షాలకు కొన్ని మండలాల్లో మామిడి, బొప్పాయి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంట నోటికి అందకుండా పోయిందని బాధిత రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను అధికారులు పరిశీలించి పంటనష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మణిపూర్‌లో బిక్కుబిక్కు మంటున్న విద్యార్థులు

ఒక్క పూట భోజనం.. రెండు లీటర్ల నీరు...

చెర నుంచి విడిపించాలని ప్రభుత్వానికి వేడుకోలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జాతి వైషమ్యాలతో మణిపూర్ అగ్నిగుండంగా మారింది. వరుసగా జరుగుతున్న హింసాత్మక ఘటనలతో అక్కడున్న తెలుగు విద్యార్థులు బిక్కుబిక్కు మంటున్నారు. ఎన్‌ఐటియు , ట్రిపుల్ ఐటి, కేంద్రీయ వ్యవసాయ కళాశాలలో అనేక మంది తెలుగు విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రం నుంచి 157 మంది చదువుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి ఏడుగురు విద్యార్థులు ఉన్నట్టు గుర్తించారు. వారితో 'ప్రజాశక్తి' పోన్‌లో మాట్లాడింది. ఈ సమయంలో వారి బాధలు కష్టాలను పంచుకుంది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంతో బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నామని విద్యార్థులు తెలిపారు.



మణిపూర్‌లో ఉన్న అనంతపురానికి చెందిన యజ్ఞశ్రీ

ఒక్క పూటే భోజనం... రెండు లీటర్ల నీరు

బయట పరిస్థితి ఉద్రిక్తతంగా ఉంది. బయటకు అడుగుపెట్టాలంటే భయపడే పరిస్థితులున్నాయి. శనివారం రాత్రి కూడా క్యాంపస్ బయట బాంబు పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. తాముంటున్న హాస్టల్‌లో రోజుకు ఒక్క పూట మాత్రమే భోజనం లభిస్తోంది. తాగునీటిలోనూ విషం కలుపడంతో నీరు కూడా రావడం లేదు. రోజుకు ఒకటి లేదా రెండు లీటర్లు బాటిళ్లు మాత్రమే అందజేస్తున్నారు. వాటితోనే కాలం గడపాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లోనూ హాస్టల్‌లో లైట్లు అన్నీ బంద్ చేసుకుని అంధకారంలోనే గడుపుతున్నాం. ఇంటర్‌నెట్ సౌకర్యమూ లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమను ఇక్కడి నుంచి బయటకు తీసే ప్రయత్నాలు చేయాలని వేడుకుంటున్నాం.

దినేష్ ఎన్ఐటి ,
పుట్టపర్తి

ప్రభుత్వం తమను స్వస్థలాలకు చేర్చాలి

ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తతంగా ఉంది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయం అందరిలోనూ ఉంది. స్థానికంగా ఉండే వారు హాస్టళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. బయట నుంచి వచ్చిన వాళ్లమే ఉన్నాం. మా క్యాంపస్‌లో ఉదయం, సాయంత్రం రెండు పూటల మాత్రమే భోజనం దొరుకుతోంది. స్నానాలు చేయడానికి కూడా నీళ్లు లేవు. ఐదు రోజులుగా అలాగే ఉంటున్నాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించి తమను స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

బి.సునీల్ నాయక్,
కదిరి

బయట ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయి

మేము ఉంటున్న ట్రిపుల్ ఐటి క్యాంప్ ప్రాంతంలో బయట ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. తమ వరకు క్యాంపస్‌లో భోజనం, ఇతర వసతులు సక్రమంగానే అందుతున్నాయి. అయితే బయటకు వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. కొద్ది రోజులు ఉంటే అన్నీ సర్దుకుంటాయని యాజమాన్యం చెబుతోంది.

తేజేశ్వరరెడ్డి,
పుట్టపర్తి

ప్రభుత్వం సురక్షితంగా తీసుకురావాలి

మా అమ్మాయి మణిపూర్ ఎన్‌ఐటిలో సిఎస్సి ఫస్ట్ ఇయర్ చదువుతోంది. నాలుగైదు రోజులుగా అక్కడ జరుగుతున్న హింసాత్మక సంఘటనలతో అక్కడ చదువుతున్న తెలుగు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సరైన భోజనం వసతి కూడా లేదని చెబుతున్నారు. బయటకు వెళ్లే పరిస్థితులూ లేవు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన విద్యార్థుల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తమ పిల్లలను సురక్షితంగా ఇళ్లకు చేర్చే చర్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నాం.

గుర్రం ప్రతాప్ , యజ్ఞశ్రీ తండ్రి,
అనంతపురం

ఈ పండ్లు తింటే పడకే !!

◆పక్వానికి రాకముందే రసాయనాలతో మగ్గిస్తున్న వైనం
◆ప్రజల ప్రాణాలతో చెలగాటం ◆పట్టించుకోని అధికారులు



మామిడికాయల్లో రసాయనాల పొడి ఉన్న పొట్లాలు ఉంచిన దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పక్వానికి రాకముందే పండ్లను కృత్రిమంగా మగ్గించేందుకు రసాయనాలను యథేచ్ఛగా వాడుతున్నారు. ఇలా మగ్గిన పండ్లను తింటే క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, మూత్రపిండాలు దెబ్బతింటాయని పలువురు వైద్యపరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కృత్రిమంగా పండ్లను మగ్గిపెట్టే పక్రియకు బ్రేక్ వేయాలని హైకోర్టు అనేకసార్లు హెచ్చరించింది. ఈ మేరకు అధికారులను అప్రమత్తం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రసాయనాలతో మగ్గిస్తే రూ.1లక్ష జరిమానాతోపాటు ఐదు సంవత్సరాలు జైలుశిక్ష విధించేలా నిర్ణయించింది. అయితే హై కోర్టు ఆదేశించినప్పుడు అధికార యంత్రాంగం వారం పదిరోజులు హడావుడి చేసింది. రసాయనాలతో మగ్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తనిఖీలు చేసి కొంతమందిపై కేసులు కూడా పెట్టారు. వ్యాపారులకు రూ.10వేల నుంచి రూ.20వేలు అపరాధ రుసుం విధించారు. తర్వాత పరిస్థితి షరామామూలే అయింది.

ఉమ్మడి జిల్లాలో 1.22 లక్షల హెక్టార్లలో పండ్లతోటలు సాగవుతున్నాయి. రైతులు పండించిన కాయలు పక్వానికి వచ్చినప్పుడుకోత కోసిన కాయలను వారికి అనుకూలంగా ఉన్నట్లయితే బోదగడ్డి, వరిగడ్డి లేకర్లుగా వేసి మాగించే విధానాలు పాటించాలి. రైతులకు అనుకూలంగా లేకపోతే కాయలను మగ్గించేందుకు ప్రభుత్వమే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు రైఫనింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసింది. అనంతపురం మార్కెట్ యార్డులో పండ్లు మగ్గించేందుకు మూడు ఛాంబర్స్ ఉన్నాయి కదిరి, గుత్తి, కళ్యాణదుర్గం, మార్కెట్‌యార్డులలో ఒక్కొక్క కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు ఈ విధానంతో పండ్లను మగ్గిస్తే ప్రజలకు ఆరోగ్యపరంగా సమస్యలు తలెత్తవు. రైతులు పండించిన ఉద్యాన ఉత్పత్తులు మామిడి, సపోటా, అరటి, కర్బూజా, పైనాపిల్, బొప్పాయి వంటి వాటికి మగ్గించేదుకు ఈ కేంద్రాలను వినియోగించుకొనే అవకాశాలున్నాయి. కాయలను కోసినప్పుడే పక్వానికి వచ్చిన సమయంలో కోత కోసుకునే విధంగా ఆ శాఖ అధికారులు సలహాలను ఇస్తున్నారు. అవేవి తమకు పట్టవనే ధోరణిలో వ్యాపారులు కొత్త ఫలాలను మార్కెట్‌లోకి తెచ్చి సొమ్ము చేసుకొనే రీతిలో వ్యవహరిస్తున్నారు. కోసిన వాటిని అమ్మిసొమ్ము చేసుకొనేందుకు రసాయనాలు వాడుతున్నారు. పకృతి వైపరీత్యాలు కారణంగా ప్రస్తుత పరిస్థితులలో గాలివానలకు పండ్లతోటలు దెబ్బతింటున్నాయి. గాలి వానలకు నేలరాలిపోయిన కాయలను వ్యాపారులు తక్కువ ధరకు కొని వాటికి రసాయనాలు వాడి మగ్గేలా చేస్తున్నారు.



అమ్మకానికి ఉంచిన మామిడి పండ్లు

మన ప్రాంతాల్లో పండే పండ్లతో పాటు ఇతర ప్రాంతాలలో పండే పండ్లను తెప్పించి రసాయనాల ద్వారా మగ్గిస్తున్నారు. కాశ్మీర్‌నుంచి అట్టపెట్టెల్లో ఆపిల్స్ బెంగళూరుకు వస్తాయి. వాటిని కోనుగోలు చేసుకొని గోడౌన్లలోఉంచుతారు. ఆ పెట్టెలలో చిన్న కార్బైడ్ ముక్క ఉంచి గాలి లోపలికి వెళ్లకుండా చేసి గోడౌన్లలో ఉంచుతారు. 24 గంటల తరువాత ఆపిల్ పెట్టెను తెరిస్తే కాయలు ఆకర్షణీయంగా మంచి రంగుతో కన్పిస్తాయి. మన రాయలసీమ ప్రాంతాల్లో లభించే మామిడి కాయలకు ఇదే పద్ధతే అనుసరిస్తారు. కర్బూజ, బొప్పాయి వంటి వాటి పరిస్థితి కూడా ఇలాగే ఉంటుంది. దాదాపు చాలా రకాల పండ్లను ఇలా కృత్రిమంగానే మగ్గిస్తున్నారు. పక్వానికి రాని కాయలను కోసి ఒక్క రోజులోనే పండ్లుగా మార్చే హడావుడిలో హోల్‌సేల్ వ్యాపారులు కృత్రిమ పద్ధతులు పాటిస్తున్నారు. కార్బైడ్స్ ముక్కలను కాగితంలో పొట్లాలుగా కట్టి పండ్ల మధ్యలో పెడితే అవి మగ్గిపోతాయి. అరటి పరిస్థితి అంటే కార్బైడ్స్ అనే రసాయనాన్ని నీటి డ్రమ్ములతో కలిపి అందులో గెలలు మునగనిచ్చి వాటిని గోడానులో వుంచితే అవికూడా మంచి రంగుతో పండి పోతాయి. ఇలా అన్ని రకాల పండ్లను హానికర రసాయనాలతోనే మగ్గిస్తున్నారు. కార్బేడ్స్ నిషేధిత రసాయనమైనా పండ్ల వ్యాపారులకు మార్కెట్‌లో యథేచ్ఛగా లభిస్తుండటం గమనార్హం.

ఈ పండ్లుతింటే రోగాలే....

రసాయనంతో మగ్గిస్తున్న పండ్లను తింటే క్యాన్సర్, మూత్రపిండ, జీర్ణకోశ తదితర వ్యాధుల బారిన పడతారని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవన్ని తెలిసినా కంటికి ఇంపుగా కనిపిస్తే చాలా కొనుక్కొని తింటున్నాం. తనిఖీ అధికారులు అడపాదడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంఉటన్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో హోల్‌సేల్ వ్యాపారుల ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోయింది. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న వ్యాపారుల మీద సరైన చర్యలు తీసుకోకపోవటంతోనే ఇలాంటి పరిస్థితి దాపురించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేసులు పెడితే వచ్చేలాభం ఏముందన్న ధోరణితో కొందరు అధికారులు మామూళ్లు పుచ్చుకొని వెళుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

నిర్లక్ష్యపు నీడన అధికారులు

రసాయనాలతో పండ్లను మాగించే వారిపై వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు, సీనియర్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు కేసులుపెట్టే అధికారాన్ని ప్రభుత్వం కల్పించింది. రసాయనాల ద్వారా పండ్లు మగ్గిస్తే ఏడాది పాటు జైలుశిక్ష, రూ.5లక్షలు జరిమానా విధించాలని కోర్టు ఆదేశించింది. రెవెన్యూ, పోలీసులు సైతం పండ్లను రసాయనంతో మగ్గిస్తే కేసులు పెట్టవచ్చు. అయినప్పటికి శాఖల మధ్య సమన్వయ లోపంతో, పండ్ల వ్యాపారులపై ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారులు అందరు కలిసి ఒక్కసారిగా పండ్ల వ్యాపారులపై తనిఖీలు ముమ్మరం చేస్తే పెద్ద మాఫియా బయట పడుతుంది.

చిన్నమంతూరులో తాగునీటి తిప్పలు



తాగునీటి కోసం ట్యాంకు వద్ద గుమికూడిన గ్రామస్తులు

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని చిన్నమంతురు వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో శుద్ధ జల కేంద్రం ఉన్న కూడా ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఆదివారం గ్రామంలోకి వచ్చిన శుద్ధ జల ట్యాంకరు వద్ద గ్రామస్తులు పెద్దసంఖ్యలో గుమికూడారు. చిన్న పెద్ద తేడా లేకుండా నీటి కోసం ఎగబడ్డారు. గ్రామంలో ఉన్న శుద్ధ జల కేంద్రం కొన్ని నెలలుగా పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోయారు. సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. మూతపడిన శుద్ధ జల కేంద్రాన్ని మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి నెలరోజుల క్రితం వినతిపత్రం అందజేశామన్నారు. అయినా కూడా స్పందన లేదన్నారు. దీంతో తమకు తాగునీటి సమస్య దినదినగండగా మారిందన్నారు. అసలే వేసవికాలం కావడంతో ఎండ ఉధృతి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శుద్ధ జల ట్యాంకర్ గ్రామంలోకి ఎప్పుడు వస్తుందో తెలియక పనులు మానుకుని నీటి కోసం ఇంటివద్దనే ఉండాల్సి వస్తోందని వాపోయారు. పొలంపనులకు, కూలి పనులకు కూడా వెళ్లకుండా నీటి కోసం ఇంటివద్దనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామంలో ఉన్న శుద్ధ జల కేంద్రాన్ని మరమ్మతులు చేపట్టి ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్. గేయానంద్

చదువుతోపాటు సామాజిక అవగాహన అవసరం

మాజీఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంత చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పిల్లలకు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. అనంత చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఆదివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి తదితరులతో కలిసి సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ అనంత చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లల కోసం సమ్మర్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలకు చదువుతో పాటు సమాజం పట్ల, చుట్టుపక్కల వారి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ వేసవిలో ఇలాంటి క్యాంపు ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్ని రంగాలలో పోటీతత్వం ఉన్నట్లే చదువులో కూడా వచ్చిందన్నారు. అందుకోసం పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి మార్కులతో పాస్ అవ్వాలని నిరంతరం పిల్లలపై ఎక్కువ ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. దీని వల్ల చదువు తప్ప వేరే ఆలోచన పిల్లలకు రావడం లేదన్నారు. దీని వల్ల పిల్లలలో నైపుణ్యత, సృజనాత్మకత లేకుండా పోతుందన్నారు. ఈ క్యాంపులో పిల్లలకు ఉపయోగపడేలా 20 రకాల ఈవెంట్స్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ క్యాంపు నిర్వహిస్తున్న క్లబ్స్ మెంబర్స్‌ను అభినందించారు. అనంత చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ నరసింహారెడ్డి, కో కన్వీనర్ కృష్ణవేణి మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాన్స్‌మాస్టర్ కుళ్లాయి స్వామి, విజ్ఞానకేంద్రం కన్వీనర్ శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, ఆఫీస్ కార్యదర్శి సురేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, ఖజీబి, గౌతమి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై ప్రత్యేక నిఘా

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్



హిందూపురం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో అక్రమ కట్టడాలపై ప్రత్యేక నిఘా వేస్తామని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హిందూపురం పురపాలకసంఘం కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు విడుదల అయిన వెంటనే పురపాలక సంఘాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఉత్తమ పురపాలక సంఘంగా తీర్చిదిద్దుతామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని చెప్పారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రమోద్‌కుమార్ పట్టణ అభివృద్ధిపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు మాట్లాడారు.

ప్రజాశక్తి : పట్టణ పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు ?

కమిషనర్ : పట్టణంలో పారిశుధ్యాన్నిమెరుగు పరచడం కోసం ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం 80 మంది పర్మినెంట్ కార్మికులు, 220 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగాకార్మికుల సంఖ్య తక్కువగా వుంది. కోవిడ్ సమయంలో మరో 60 మంది కార్మికులను తీసుకున్నాము. వారితో రాత్రి సమయంలో పారిశుధ్య పనులు చేపడుతున్నాము.

ప్ర: పారిశుధ్య మెరుగుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?

కమిషనర్ : పారిశుధ్య వ్యవస్థ మెరుగు పరచడానికి ప్రణాళికలను రూపొందించుకున్నాం. ఉదయం పూట ప్రధాన రహదారులు శుభ్రం చేస్తే పాదాచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. దీని కోసం నైట్ శానిటేషన్ పనులను ప్రారంభించాం. సచివాలయ వ్యవస్థ రావడంతో అందులో ప్రత్యేకంగా శానిటేషన్ సెక్రటరీని నియమించడంతో నిరంతరం పర్యవేక్షణ చేస్తు పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతాం. దీంతో పాటు మురుగు కాలువల శుభ్రం కోసం అన్ని వార్డుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యహ్నం 1గంట వరకు మేస్త్రీల పర్యవేక్షణలో గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేశాం.



ప్ర : అక్రమ కట్టడాల కట్టడికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

కమిషనర్ : పట్టణ వ్యాప్తంగా అక్రమ కట్టడాలను గుర్తించడానికి కొంత మంది అధికారులను కేటాయించాం. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు 50 గృహాలకు ఒక వాలంటీర్‌ను నియమితులయ్యారు. వాలంటీర్లు వార్డు ప్లానింగ్ సెక్రటరీల ద్వారా అక్రమ కట్టడాలను గుర్తించి, వాటిని బిపిఎస్ పథకం ద్వారా సక్రమ కట్టడంగా మారుస్తాం. అందుకు కొన్ని రోజులు సమయం పడుతుంది.

ప్ర: పట్టణంలో షెడ్ల నిర్మాణాలపై స్పందన ఏమిటి?

కమిషనర్ : పురపాలక సంఘంలో వారి సొంత స్థలాలలో పక్కా భవనాలు కట్టుకోవడానికి అనుమతులు అవసరమవుతాయి. వారి స్థలంలో తాత్కాలికంగా ప్రహరీ, షెడ్ల నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు అవసరం వుండదు. అయినప్పటికి పట్టణ వ్యాప్తంగా ఈ మధ్య కాలంలో వెలసిన షెడ్ల నిర్మాణాలపై తనిఖీలు నిర్వహించి ఆ షెడ్లు దేనికి వాడుతున్నారని పరిశీలించి నిబంధనల మేరకు వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర: అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?

కమిషనర్ : పట్టణంలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నది వాస్తవం. ఇప్పటికే గుత్తేదారులతో అభివృద్ధి పనులపై సమీక్షించాం. దీంతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులు, ఇతర నిధుల గురించి స్థానిక ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌కు వివరించి, ప్రత్యేక నిధులు తీసుకు వచ్చి అభివృద్ధి పనులను పూర్తిచేస్తాం.

ప్ర: బిల్లులు ఎక్కడివక్కడ అగిపోయాయి.. సరి దిద్దడానికి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు ?

కమిషనర్: నిధులు లేకపోవడంతో బిల్లుల మంజూరు అలస్యం అవుతోంది. దినివల్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీంతో పాటు గుత్తేదారులతో ఇప్పటికే మాట్లాడాము. ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు జరిగే విధంగా చర్యలు తీసుకోంటామని చెప్పడంతో గుత్తేదారులు పనులు చేయడానికి ముందుకు వస్తున్నారు.

ప్ర: వీధిజంతువుల సంచారంతో ప్రజలు విసిగిపోతున్నారు.. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారు ?

కమిషనర్ : కుక్కలు, పందులు, ఆవులు, కోతులు పెద్ద సమస్యగా మారాయి. ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక సిబ్బందిని పిలిపించి, వారితో కుక్కలు, కోతులు పట్టిస్తున్నాం. ఆవులను గోశాలకు తరలిస్తున్నాం. రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆవులకు సంబందించిన యజమానులకు జరిమానాలు విధిస్తున్నాం. పందులు తరలించేందుకు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. అయినా వాటిని ఇతర రాష్ట్రాలకు తరలించే చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: క్లాప్ కార్యక్రమం ఎంత వరకు అమలు చేస్తున్నారు ?

కమిషనర్: హిందూపురం పురపాలక సంఘంలో క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) దిశగా అడుగులు వేస్తున్నాం. ఇప్పటికే అన్ని వార్డులలో ప్రజలకు ఇంటికి మూడు బుట్టలను అందించి, ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. చెత్త సేకరణ అనంతరం చెత్త సేకరించినట్లు ఇంటి యజమానుల సంతకాలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించాం. మరో మూడు నెలల్లో క్లీన్ హిందూపురం లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించి ముందుకు సాగుతున్నాం.

ప్ర: ప్లాస్టిక్ నిషేధంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

కమిషనర్ : హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. దీని కోసం సచివాలయాల వారిగా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశాం. కమిటీల ద్వారా తనఖీలు ముమ్మరం చేస్తున్నాం.

ప్ర: కౌన్సిల్ సహాకారం ఎలా ఉంది ?

కమిషనర్: నూతనంగా బాధ్యతలు స్వీకరించా. పార్టీలకు అతీతంగా అన్ని వార్డు కౌన్సిలర్లను కలుపుకుని పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఒక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తా.



విద్యార్థిని శ్రావణితో కెహెచ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు

సిఎంకప్ హాకీ పోటీల్లో ధర్మవరం విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్ర స్థాయి సీఎం కప్ హాకీ పోటీల్లో ధర్మవరం పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని శ్రావణి ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకూ తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో శ్రావణి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. శ్రావణిని ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ జీవన్ కుమార్, పీడీ ఆనంద, అధ్యాపకులు చిట్టెమ్మ, షమీవుల్లా, కిరణ్‌కుమార్, గోపాల్ నాయక్, పావని, భువనేశ్వరి, పుష్పావతి, గౌతమి అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రమైన పుట్టపర్తి కలెక్టరేట్‌లో సోమవారం 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి వెలువడిన ఓ ప్రకటనలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు కలెక్టర్ స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే మండల, డివిజన్ కేంద్రాల్లో కూడా 'స్పందన' నిర్వహిస్తారని ప్రజలు సమస్యలు విన్నవించుకోవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

'పది'లో తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

రొద్దం: మండలంలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు మదర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ధనుంజయరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 10వ తరగతిలో తప్పిన విద్యార్థులు ఆర్.మరువపల్లిలో ఉన్న మదర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఈ నెల 10 నుంచి జూన్ 10వ తేదీ వరకూ ఉచిత బోధన, ఉచిత వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జాతీయ మానవ హక్కుల ఫోరం జిల్లా అధ్యక్షులుగా షాకీర్



కదిరి అర్బన్: జాతీయ మానవ హక్కుల ఫోరం (ఎన్‌హెచ్‌ఆర్‌పిఎఫ్) సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా చిట్వేల్ మహమ్మద్ షాకీర్‌ను నియమించినట్లు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఆర్‌పిఎఫ్ సిఈఓ రామచంద్ర నాయుడు ఎంపిక చేసి నియామక పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా షాకీర్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మానవ హక్కుల పరిరక్షణకు కషి చేస్తానని తెలిపారు. సీఈవో రామచంద్ర నాయుడుతో పాటు వైస్ ఛైర్మన్ మురళి, రాష్ట్ర అధ్యక్షుడు కష్ణారెడ్డి, రాయలసీమ జోన్ అధ్యక్షుడు లక్ష్మణ్ భరత్‌లకు కతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం టౌన్: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న పట్టణంలోని పెన్సనర్స్ భవనంలో అనంతపురంలోని అక్బర్ కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు చలపతి, కోశాధికారి సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కార్నియా స్పెషలిస్టు డా. రాణిఐశ్వర్య కంటిపరీక్షలు చేస్తారన్నారు. పెన్సనర్లు ఈహెచ్‌ఎస్, ఆధార్‌కార్డులు తీసుకుని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 97045 13387 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

నేడు కల్లూరులో గంధం మహోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

లేపాక్షి మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో సోమవారం హజ్రత్ సయ్యద్ మహమ్మద్ యూసు ఉల్లా షా కమల్ షో ఖాద్రి సద్గురు గంధం పూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా హజరత్ మహమ్మద్ రఫీవుల్లా షా కమల్ షో ఖాద్రి సద్గురువు మాట్లాడుతూ గంధంను కొట్నూరు నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి కల్లూరు సమీపంలో వెలసిన స్వామి వారికి సమర్పిస్తామన్నారు. మంగళవారం సాయంత్రం ఖవాలి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేయక తప్పదని ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి నాగమణి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు హెచ్చరించారు. స్థానిక గణేష్ సర్కిల్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ సమయంలో రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నాలు గేళ్ల బకాయిలు చెల్లించాలని, యూనిఫామ్‌లు అందజేయాలని, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, అధికారుల వేధింపుల నుంచి కాపాడాలని కోరారు. సమావేశంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు పద్మావతి, సోమలత, భాగ్యమ్మ, అనిల్, తొలిశమ్మ, ఉమాదేవి, పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న సిపిఐ(ఎం) అభ్యర్థి అనిల్‌కుమార్

బాగేపల్లి న్యూస్...

ఎరుపెక్కిన బాగేపల్లి

ప్రజాశక్తి-చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)

కర్నాటకలో విధానసభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం బాగేపల్లి పురవీధుల్లో సిపిఐ(ఎం) ప్రచారం ముమ్మరంగా సాగింది. ఎర్రజెండాల రెపరెపల నడుమ బాగేపల్లి మెరిసింది. అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ వాహనంపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ప్రచార రథం ముందు కదిలిన కళాజాతా ప్రదర్శన ఆకట్టుకొంది. ప్రధాన కూడళ్లలో అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ ప్రసంగిస్తూ సిపిఐ(ఎం)కి ఓటు వేయడం అంటే మీ గ్రామానికి రోడ్డు, బస్సు వేసుకోవడం, ప్రభుత్వ పాఠశాలను అభివద్ధి చేసుకోవడం, పరిశ్రమలు తెచ్చుకొని ఉద్యోగాలు పొందడం, అప్పుల నుంచి మహిళా సంఘాల సభ్యులు బయటపడటం, మీ భూమి పట్టాలు మీ ఇంటికి తెచ్చుకోవడం, మీ సొంతింటి కలను నిజం చేసుకోవడం, ప్రతి కేంద్రంలో ఆధునిక ఆసుపత్రి నిర్మించుకోవడం, నీటి కొళాయిలకు బిగించిన మీటర్లు తొలిగించడం, భాగ్యజ్యోతి ద్వారా ఐదేళ్ల పాటు ఉచితంగా విద్యుత్ పొందడం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాన్ని పూర్తిగా నాశనం చేయడం, భూ కబ్జాదారులని బాగేపల్లి నుంచి తరిమి కొట్టడం అని పేర్కొన్నారు. ఇవన్నీ జరగాలంటే ఓటు వేస్తేనే సాధ్యమవుతుందన్నారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ(ఎం), జెడిఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతు, ప్రజాసంఘాలు, అభ్యర్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మేళతాళాల మధ్య ఉత్సవ మూర్తులను తీసుకొస్తున్న దశ్యం, స్వామికి పుష్పయాగం సమర్పించిన ఉభయదాతలు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీచెన్నకేశవుని పుష్పయాగం

శయనోత్సవంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పుష్పయాగం క్రతువును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామి వారు శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు ఉభయదాతలు శ్రీఅన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య, పొరాళ్ల పద్మావతి, వారి కుమారుడు పుండరీకాక్ష, కుమార్తె పూజిత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి వివిధ రకాల పుష్పాలు సమర్పించి పుష్పయాగం చేయించారు. బంతి, చామంతి, పారిజాత, సంపంగి, సుగంధ, నీలాంబరి, కనకాంబరి. శ్రీకష్ణతులసి, తరామతులసి, గుండుమల్లి, సన్నజాజి, దవనం, గులాబీలతో స్వామికి పూజలు చేశారు. అలాగే సహస్ర నామాలతో అన్నమయ్య సంకీర్తనలను అన్నమయ్య సేవా సమితి సభ్యులు ఆలపించారు. సాయంత్రం 6 గంటలకు శయనోత్సవం (ఏకాంతసేవ) కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ఛైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నేత మృతి

బాధిత కుటుంబాలకు పరిటాల సునీత పరామర్శ

ప్రజాశక్తి-కనగానపల్లి



నరసింహులు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న పరిటాల సునీత

మండల పరిధిలోని బద్దలాపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వరవరరావు అలియాస్ నరసింహులు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి పరిటాల సునీత హుటాహుటిన బద్దలాపురం గ్రామం వెళ్లి నరసింహులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఇటీవల మరణించిన మరో టీడీపీ సీనియర్ నేత దాసరి రామయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమములో టిడిపి మండల కన్వీనర్ యాతం పోతులయ్య, రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, రాజకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చేపలచెరువు సొసైటీ ప్రెసిడెంట్‌గా తలారి కృష్ణ

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు



తలారి కృష్ణకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

ఓబులదేవరచెరువు చేపల చెరువు సొసైటీ ప్రెసిడెంట్‌గా (పరిగి) తలారి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చేపల చెరువు సొసైటీ సభ్యులు మందోజి ఆరిఫ్ ఖాన్ ఎన్నికల అధికారిగా నిర్వహించారు. అలాగే సొసైటీ సెక్రటరీగా బావసావపల్లికి చెందిన ఎస్.బాషు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.నరసయ్య, మరో ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రామచంద్ర, నరసింహులు, అబ్దుల్, అంజనప్ప, నాగేశ్వర, పారేసి అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు

తలుపులలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తలుపుల

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991 నుంచి 1995 వరకూ చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక హైస్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అప్పటి గురువులను సన్మానించి ఆశీస్సులు పొందారు. అలాగే ఒకరిని ఒకరు పలకరించుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారి వారి కుటుంబాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అందరూ కలిసి సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపి విందు భోజనం చేశారు. 28 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం పేరుతో కలవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పద్మాకర్, సక్రు నాయక్, సూర్యనారాయణ, అప్పటి అటెండర్ ఆచారి పాల్గొన్నారు.

పెనుకొండలో..

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని శ్రీసత్య సాయి ఎలిమెంటరీ కళాశాలలో 2012-14 మొదటి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి వచ్చిన పూర్వ విద్యార్థుల్లో చాలా మంది ఉపాధ్యాయ వత్తి చేపట్టగా మరికొందరు వేర్వేరు వత్తుల్లో స్థిరపడ్డారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రతాప్, కళాశాల ఏఓ కేశవయ్య హాజరవగా ఉపాధ్యాయులు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న శ్రీసత్య సాయి ఎలిమెంటరీ పాఠశాల పూర్వ విద్యార్థులు



సాయి తేజ(551) జస్వంత్(551) నందీష్(535)

'పది' ఫలితాల్లో మెరిసిన 'టీచ్' విద్యార్థులు

ప్రజాశక్తి-రొద్దం

పదో తరగతి ఫలితాల్లో స్థానిక టీచ్ హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సష్టించారు. మొత్తం 22 మంది పరీక్షలు రాయగా 21 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఏడుగురు 500కి పైగా మార్కులు సాధించారు. సాయి తేజ-551, జస్వంత్-551, నందీష్-535, ఐషా-518, జాహ్నవి-512, నవ్య-509, వెంకటేష్-504 మార్కులు సాధించారని కరస్పాండెంట్ తిమ్మారెడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా మండల వ్యాప్తంగా అధిక శాతం ఉత్తీర్ణత సాధిస్తున్న ఏకైక పాఠశాల టీచర్ హై స్కూల్ అని తెలిపారు.



ఐషా(518)



జాహ్నవి(512) నవ్య(509) వెంకటేష్(504)

దళితుల ఆత్మగౌరవ సభ పోస్టర్ల విడుదల

ప్రజాశక్తి-రొద్దం

దళిత డాక్టర్ సుధాకర్‌కు జరిగిన అన్యాయంపై ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'మాదిగల ఆత్మగౌరవ సభ' పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ యువత జిల్లా అధ్యక్షుడు నల్లూరు నాగరాజు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం కరోనా మహమ్మరి ఎంతోమంది ప్రాణాలు బలికొందన్నారు. వేలాది కుటుంబాలు కనీసం చివరిచూపునకు నోచుకోలేక పోయారన్నారు. అలాంటి విపత్కర పరిస్థితుల్లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో మత్తు(అనస్థీషియా) వైద్యుడిగా పని చేస్తున్న దళిత డాక్టర్ సుధాకర్ ప్రభుత్వాన్ని మాస్కులు అడిగినందుకు సస్పెండ్ చేసి, నడి రోడ్డుపై బట్టలు ఊడదీసి, కొట్టి, మానసిక ఆరోగ్య పరిస్థితి బాగా లేదని మెంటల్ ఆసుపత్రిలో చేర్పించి, ఆయనను మానసికంగా చంపి, గుండెపోటుతో చనిపోయేలా చేశారన్నారు. దీంతో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డా. సుధాకర్ సంతాప సభ నిర్వహించి నివాళులు అర్పిస్తున్నట్లు తెలపారు. దళితులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నెల్లూరు నాగరాజు, బాబు, ప్రసాద్, రాజు, బైలంజి, కదిరప్ప, నగప్ప, నరసింహులు, ఓబులేసు, మోహన్, నవీన్ పాల్గొన్నారు



దళితుల ఆత్మగౌరవ సభ పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం



ప్రతిభ కనబరిచిన సాయిబాబా విద్యానికేతన్ విద్యార్థులు

సాయిబాబా విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తనకల్లు

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న సాయిబాబా విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పరీక్షలు రాసిన విద్యార్థుల్లో 85% మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు మొగల్ సలీం బాషా తెలిపారు. ముఖ్యంగా పి.మెహతాజ్ 527 మార్కులు సాధించడంతో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



ప్రతిభ కనబరిచిన సాయిబాబా విద్యానికేతన్ విద్యార్థులు

వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని ఆలాపల్లి పంచాయతీ ఉగ్గిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితులు పంచరత్న సురేష్ శర్మ బందం వేదమంత్రాల మధ్య సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 5వ తేదీ వైశాఖ పౌర్ణమి స్వాతి నక్షత్రం పురస్కరించుకొని సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలకు నవధాన్యాలు, కలశ పూజలు, విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠాపన పూజలను మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొబ్బరి, అరటి, మామిడి ఆకుల తోరణాలతో అలంకరించిన పచ్చని పందిళ్ల కింద సీతారాముల పంచ లోహ విగ్రహాలకు పుష్ప మాలధారణతో శాస్త్రోక్తంగా కన్యాదానం, కంకణాలు, మంగళసూత్రాలు సమర్పించి కల్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కునుకుంట్ల శ్రీధర్, జడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, ఆర్ఐ నాగేంద్ర, సామకోటి ఆదినారాయణ, సర్పంచి వెంకటరమణ, ఎంపిటిసి, బొడ్డు జయన్న, మధు, ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు, యువ సేవకులు మల్లెల రమేష్, తదితరులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలు అందజేశారు.

చింతమాను గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మొలకల పౌర్ణమి సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని మల్లమీదపల్లి పంచాయతీ కోటూరు వద్ద వెలసిన చింతమాను గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు స్థానిక సర్పంచి కళావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా మొలకల పౌర్ణమి సందర్భంగా ఇక్కడ మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. అందులో భాగంగా చాందినీ బండ్లు, బెరవాండ్లు, చెక్క భజనలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి భాస్కర్ రెడ్డి, సర్పంచిలు రవీంద్ర నాయక్, చలపతి, వైసీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

కొత్తచెరువు : కొత్తచెరువులోని కమ్మపాలెం వీధిలో ఉంటున్న సీనియర్ జర్నలిస్ట్ విజయకుమార్ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకొని ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ విషయం తెలుసుకొని ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అతడి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బేకరీ నాయుడు, టిడిపి నాయకులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండల పరిధిలోని యు.రం గాపురం రోడ్డు మలుపు వద్ద శనివారం జరి గిన రోడ్డు ప్రమాదంలో గుడిబండ మం డలంలోని ఎస్ఎస్ గుండ్ల గ్రామానికి చెం దిన గణేష్(40) అక్కడికక్కడే మృతి చెందా డు. అతడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గణేష్ ద్విచక్ర వాహనంపై మడకశిరకు వెళ్తుండగా మడకశిర నుంచి ఇటువైపు వస్తున్న సిమెంట్ మిక్సింగ్ లారీ రోడ్డు మలుపు వద్ద ఢీ కొన్నడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం తెలుసు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని మడకశిర ఆస్పత్రికి తరలించారు. అతడికి భార్య లలితమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

అమరాపురం : మండల పరిధిలోని బసవనపల్లిలో జరుగుతున్న భూతప్ప ఉత్సవాల నేపథ్యంలో ఓ మహిళకు పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీదేవి(24) శిర తాలూకా దొడ్డహులికుంట ఓబలి కటనాహల్లి గ్రామానికి చెందిన భాగ్యమ్మ, మరి కొందరితో కలిసి ఉత్సవాలకు వెళ్లింది. అయితే శనివారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రపోతుండగా విషపురుగు కాటు వేసింది. దీంతో ఆమెను వెంటనే మడకశిర ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ముద్దిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

మద్యం స్వాధీనం.. నిందితుడు అరెస్టు

కొత్తచెరువు : కొత్తచెరువు నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. బుక్కపట్నం మండలంలోని లింగప్పగారిపల్లికి చెందిన శ్రీనివాసులు మద్యం దుకాణం నుంచి 30 సీసాలను తీసుకుని అక్రమంగా గ్రామానికి తరలిస్తుండగా తనిఖీలు చేసి అతడి నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొన్నారు. అలాగే అతడిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్టు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తచెరువు : పుట్టపర్తి మండల పరిధిలోని ఇనుములపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్ ఆదివారం ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా స్థానిక పుట్టపర్తి రోడ్డులోని నాగులకనం వద్ద తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లో తరలిస్తుండగా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'పది'లో కదిరి టాపర్ అతిఫాకు నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పదో తరగతి ఫలితాల్లో కదిరి పట్టణంలోని పదో వార్డు మశానంపేటకు చెందిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి మదికేరే అతిఫా 586 మార్కులు సాధించి కదిరి టాపర్‌గా నిలిచింది. దీంతో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ ఆదివారం తన నివాసంలో అతిఫాకి రూ. 10వేల ప్రోత్సాహక నగదు అందజేసి అభినందించారు. అలాగే శాలువా, బొకేలతో అభినందించి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారన్నారు. బాలిక ఉన్నత చదువులకు అండగా ఉంటానని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి కదిరి పట్టణ పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కేఎస్ బహావుద్దీన్, రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, ఫాహద్, బత్తల యువసేన సభ్యులు ముబారక్, కిరణ్, బాబ్‌జాన్, సూర్యనేని కిరణ్, మిట్టపల్లి ఆదినారాయణ, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవే 'యువర్స్' ఫౌండేషన్ లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న కంటి వైద్యులు

పేదలకు సేవలందించడమే యువర్స్ ఫౌండేషన్ లక్ష్యమని అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కర్నూలులోని చక్ర ఆస్పత్రి నిర్వాహకులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 1991-92 బ్యాచ్ కొత్తపేట రైల్వే స్కూల్ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కంటి చూపు మందగించిన 80 మందికి వైద్య నిపుణులు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఇందులో 40 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. అనంతరం వైద్యులు కంటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. ఈ సందర్భంగా వైకే శ్రీనివాసులు మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పేదల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాక్రిష్ణ, క్యాంప్ ఛైర్మన్ శీలా నాగేంద్ర, సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, పోలా ప్రభాకర్, రమేశ్ బాబు, బండి నాగేంద్ర, నామాల శ్రీనివాసులు, పీఆర్‌ఓ జయరాం, పూర్వ విద్యార్థులు రంగం బాలాంజనేయులు, పల్లా లక్ష్మీనారాయణ, రంగం శ్రీనివాసులు, జక్కా రామకృష్ణ పాల్గొన్నారు.

'పది'లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కుమార్తె ప్రతిభ

ప్రజాశక్తి-కదిరి టౌన్



సారియా సాదిక్ (578)

కదిరి పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నీసా సాధిక్ కుమార్తె సారియా సాదిక్ పదో తరగతి ఫలితాల్లో 578 మార్కులతో ప్రతిభ కనబరిచింది. సారియా మాట్లాడుతూ కదిరి పట్టణంలోని నారాయణ స్కూల్‌లో చదివానని, ఉపాధ్యాయుల మెలకువలు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే మంచి మార్కులు సాధించానన్నారు. తల్లిదండ్రుల సహకారంతో తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానన్నారు.

14న 'ఎన్ఆర్ఐ' ప్రతిభా పరీక్ష

కదిరి టౌన్ : ఎన్ఆర్ఐ విద్యాసంస్థల ట్యాలెంట్ హంట్-2023 పోస్టర్లను ఆదివారం పట్టణంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం నగరంలోని ఎన్ఆర్ఐ విద్యాసంస్థల యాజమాన్యం పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఈ నెల 14వ తేదీ ట్యాలెంట్ హంట్-2023 కాంపిటేటివ్ పరీక్ష నిర్వహించడం గర్వకారణం అన్నారు. అందులో 1 నుంచి 10 లోపు ర్యాంకులు వచ్చిన వారికి ఎలాంటి ఫీజు లేకుండా, ఉచిత వసతితో పాటు పుస్తకాలు అందజేస్తారన్నారు. 10 నుంచి 20 లోపు ర్యాంకులు వచ్చిన వారికి 80శాతం ఫీజు, 20 నుంచి 50 లోపు ర్యాంకులు వచ్చిన వారికి 50శాతం ఫీజు రాయితీస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ సిలబస్‌లో పరీక్ష ఉంటుందన్నారు. ఎన్ఆర్ఐ విద్యాసంస్థలు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ బిల్డింగ్, ఆదిమూర్తి నగర్, అనంతపురం చిరునామాలో మరిన్ని వివరాలకు 94944 72722, 96523 80088 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎం.డి చంటి రెడ్డి, అకడమిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట సుబ్బయ్య , వైస్ కౌన్సెలర్ పద్మ పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

కొత్తచెరువు: స్థానిక గ్రంథాలయంలో మే 8 నుంచి జూన్ 11వ తేదీ వరకూ విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కే.జయరాం తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వథా చేయకుండా గ్రంథాలయానికి వచ్చి పాఠ్య పుస్తకాలు, పత్రికలు చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు.